క్లుప్తంగా

ఆలయ భూముల ద్వారా రూ. 5.73 లక్షలు

మహానంది: బుక్కాపురంలోని ఈశ్వరాంజనేయస్వామి దేవస్థానం వద్ద గురువారం ఆలయ భూములకు బహిరంగ వేలాలు నిర్వహించారు. వేలాల ద్వారా రూ.5.73 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. 20 ఎకరాల భూములకు గత ఏడాది రూ.2.80 లక్షలు రాగా ఈ ఏడాది అదనంగా రూ.2.93 లక్షలు ఆదాయం పెరిగిందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బండి ఆత్మకూరు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ, వ్యవసాయ కమిటీ మండల నాయకులు రత్నమయ్య, డేవిడ్ తదితరులు గురువారం ఎంపీడీఓ ఎం.దస్తగిరికి వినతిపత్రం సమర్పించారు. వేలాది మంది శ్రామికులకు ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ. 26 వేలు ప్రకటించి, పీఎఫ్, ఈఎస్ఐ సేవలు కల్పించి, ఉచిత ప్రమాద బీమా రూ.10 లక్షలు ప్రకటించాలని, వారికి రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ, యూనియన్ నాయకులు నాగరాజు, నాగన్న పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్ రత్నరాధిక అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. పొలం కౌలుకు చేసుకుంటున్న రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రం మంజూరు చేయాలన్నారు. కౌలు పత్రాలు పొందడం ద్వారా పంట నమోదు, అన్నదాత సుఖీభవ, రాయితీపై విత్తనాలు, పంట బీమా, పంట నష్టపరిహారం, వివిధ వ్యవసాయ పథకాలకు అర్హులవుతారని రైతులకు తెలియజేయాలని సూచించారు. కౌలు రైతులు గ్రామాల్లోని గ్రామ రెవెన్యూ అధికారి, రైతుసేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి కౌలు కార్డులు పొందేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: అంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్వాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ అలివేలిమంగమ్మ, ఏఈ హౌసింగ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మల్లన్నకు రూ.6 లక్షల సామగ్రి విరాళం


ఆటోతోపాటు సామాగ్రిని ఈఓకు అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్ భగవాన్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల దేవస్థానానికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం శ్రీశైలం బ్రాంచ్ రూ.6,06,500 విలువ చేసే సామగ్రిని విరాళంగా అందించింది. దోమల నివారణకు ఫాగింగ్ చేసేందుకు రూ.3.10 లక్షల విలువైన అప్పీ ఎక్స్‌ట్రా క్లాసిక్ ఆటో, క్యూ కంపార్ట్‌మెంట్ గదులను శుభ్రం చేసేందుకు రూ.1 లక్ష విలువ చేసే స్క్రబ్బింగ్ అండ్ డ్రైయింగ్ మిషన్, చెత్తాచెదారాలను తొలగించేందుకు రూ.1.65 లక్షల విలువ చేసే లిట్టర్ పిక్కర్ మిషన్, పార్కింగ్ ప్రదేశాలల్లో మురుగు నీరు, వ్యర్థాలను తొలగించేందుకు రూ.31,500 విలువ చేసే వ్యాక్యూమ్ క్లీనర్‌ను బ్రాంచ్ మేనేజర్ భగవాన్ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు డి.రాధాకృష్ణ, అయ్యన్న, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం లోకకల్యాణార్థం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని త్రిఫల వృక్షం కింద నెలవైన దత్తాత్రేయస్వామికి మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

చైర్మన్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- కోరం లేక చతికిలపడ్డ మాండ్ర వర్గం
- అవిశ్వాస తీర్మానంలో నెగ్గిన ఎంపీ బైరెడ్డి శబరి వర్గం


మున్సిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లు

నందికొట్కూరు: మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం తీర్మానం గురువారం వీగిపోయింది. టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి వర్గం అవిశ్వాస తీర్మానం పెట్టారు. మాండ్ర వర్గంలో 16 మంది కౌన్సిలర్లు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వర్గంలో 11 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మంగళి అల్లూరి కృష్ణ, షేక్ నాయబ్, చెరుకు సురేష్ తటస్తంగా ఉన్నారు. ఈ ముగ్గురు అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవిశ్వాస తీర్మానం కోరం లేక వీగిపోయింది. మాండ్ర వర్గం అవిశ్వాస తీర్మానంలో చతికిలపడింది. ఉత్కంఠభరితంగా జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఎంపీ బైరెడ్డి శబరి వర్గం చైర్మన్ గిరిని ఎట్టకేలకు దక్కించుకున్నారు. అనంతరం ఆర్డో నాగజ్యోతి మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంలో 18 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం లేదు. సంఖ్యా బలం 20 మంది కౌన్సిలర్లు హాజరు కాలేదు. కోరం లేకపోవడం వల్ల అవిశ్వాస తీర్మానం వీగిపోయిందన్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నామన్నారు. కాగా డీఎస్పీ రామాంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా 144 సెక్షన్ వంద మీటర్ల వరకు విధించారు. అవిశ్వాస తీర్మాన కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, మున్సిపల్ కమిషన్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, తిరుపాలు, లక్ష్మినారాయణ, ఓబులేసు పాల్గొన్నారు.


మహానందిలో నేడు పెళ్లిళ్ల సందడి

- కొనసాగుతున్న భక్తుల రద్దీ


పెళ్లికి ముస్తాబైన మహానందిలోని కల్యాణ మండపం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. అందులో భాగంగా మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న టీటీడీ, శ్రీ కామేశ్వరీదేవి కల్యాణ మండపాలతో పాటు పలు ప్రైవేటు కల్యాణ మండపాలను వివాహాలు నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. దేవస్థానం పరిధిలో సుమారు 15 వివాహాలు జరగనున్నట్లు ప్రాథమిక సమాచారం. ఇదిలా ఉండగా గురువారం మహానందిలో భక్తులరద్దీ నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్ట విధ మహామంగళ హారతులు చేపట్టారు. కాగా ఉదయం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఫోన్ పే కొట్టు... స్టడీ సర్టిఫికెట్ పట్టు



ఎంఈఓ బ్రహ్మం నాయక్‌కు ఫోన్ పే పంపిన వివరాలు

వెలుగోడు: ఉపాధ్యాయ నియామక పరీక్షల దరఖాస్తులో ధ్రువ పత్రాలు సేకరణ అభ్యర్థులకు తలనొప్పిగా మారుతోంది. ఇదే అదనుగా భావించిన కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గడివేములకు చెందిన కమలమ్మ డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు తాను గతంలో చదివిన వెలుగోడు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో స్టడీ సర్టిఫికెట్ అవసరమైంది. ప్రస్తుతం స్కూల్ మూతపడింది. స్టడీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఎంఈఓకు అధికారముంది. ఇదే విషయమై అభ్యర్థిని ఎంఈఓ వద్దకు వెళ్లగా రూ.2000 డిమాండ్ చేసినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. రూ.2 వేలు ఫోన్‌పే చేసేంత వరకు సర్టిఫికెట్ ఇవ్వలేదని వాపోయారు. ఇదే విషయమై ఎంఈఓను వివరణ కోరగా తాను ఎవరిని డబ్బు అడగలేదని గిట్టక దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

క్షేత్రంలో పారిశుద్ధ్య పనులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైలక్షేత్రంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. క్షేత్ర పరిధిలోని ప్రధాన రహదారులు, ఆరుబయలు ప్రదేశాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులతో పాటు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

పాములపాడు: రీ సర్వేక రైతులు సహకరించాలని తహసీల్దార్ సుభద్రమ్మ కోరారు. గురువారం మిట్టకందాల గ్రామంలో భూమి పూజ చేసి రీ సర్వేను ప్రారంభించారు. సర్వే బృందం పొలాల వద్దకు వచ్చినప్పుడు పూర్తి ఆధారాలతో సహకరించాలని ఆమె రైతులకు సూచించారు. ఏవైనా తప్పులుంటే సరి చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచు చింతల నారాయణ, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, మండల సర్వేయర్ కలిముల్లా, వీఆర్వో ముర్తుజా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

వెలుగోడు: ఇళ్ల నిర్మాణాలను జూన్ 10 లోపు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారిని నాగమునేశ్వరి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న లేఅవుట్లు, సొంత స్థలాల్లో బేస్‌మెంట్, ఆర్ఎల్, ఆర్‌సీ, వివిధ దశలో ఉన్న గృహాలను పూర్తి చేయించాలని హౌసింగ్ అధికారులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం పట్టణంలోని గృహ నిర్మాణాలను పరిశీలించారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు అప్రజాస్వామికం


ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూరు: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు గురువారం అక్రమంగా ప్రవేశించి సోదాలు నిర్వహించడం అప్రజాస్వామికమని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆత్మకూరు డివిజన్ అధ్యక్షులు జోసెఫ్ శేఖర్, శ్రీశైలం నియోజకవర్గం ఆర్‌సీ ఇన్‌చార్జ్ జి.బీశేశ్వర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి పాలనను ఎత్తి చూపుతూ కథనాలు రాస్తున్న సాక్షి దినపత్రికపై, జర్నలిస్టులపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటి వద్ద ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు చేయడం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక జర్నలిస్టులు సుబ్బారెడ్డి, సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు ఈశ్వర్, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చర్యలు దుర్మార్గం

నందికొట్కూరు: సాక్షి పత్రిక సంపాదకులు ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం సిగ్గుచేటని దుర్మార్గమని ఏపీయూడబ్ల్యూజే నందికొట్కూరు అధ్యక్షుడు నగేష్ అన్నారు. గురువారం ఏపీయూడబ్ల్యూజే, ఏడబ్ల్యూజేఏ నాయకులు పట్టణంలోని కేజీ రోడ్డుపై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలోకి పోలీసులు బలవంతంగా చొరబడి తనిఖీలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పాత్రికేయులను భయపెట్టడానికి మాత్రమే పోలీసులు ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పూనుకుంటున్నట్లు భావిస్తున్నామన్నారు. ఒక పత్రికా సంపాదకుని ఇంటిలో సోదాలు జరపాలని పోలీసులు భావించి ఉంటే ముందుగా నోటీసులు ఇచ్చి ఉండాలన్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు చొరబడి తీరు గర్హనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు గోవర్ధన్, ప్రదీప్, నాగరాజు, నాగభూషణం, పరమేష్, రహంతుల్లా, ఏడబ్ల్యూజేఏ నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం


ఖైదీల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి


నందికొట్కూరు: లాయర్‌ను నియమించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. గురువారం పట్టణంలోని సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ముద్దాయిలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలు ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం 60 ఏళ్ల పైబడిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదుపాయలు, భోజనాల గురించి ఆరా తీశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్ ఖైదీలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ మహమ్మద్ రఫి, న్యాయవాది అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభాలకు ప్రత్యేక పూజలు


ధ్వజస్తంభాలకు పూజలు చేసుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి, కామాక్షి సమేత కాశీ విశ్వనాథ స్వామి, పరివార దేవతల నాభిశిల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండవ రోజు నూతన ధ్వజస్తంభాలకు ప్రత్యేక పూజలు, నీటితో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, ప్రభాత పూజ, అభిషేకాలు, మంత్ర జపములు, దీక్షా హోమం, ఆవాహితదేవతా హోమాలు, భక్తుల చేత సామూహిక హోమాలు జరిగాయి. మధ్యాహ్నం స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు కాయ, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తితో నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి

పగిడ్యాల: గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేక అధికారిణి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 443 ఇళ్లు మంజూరు కాగా అందులో 222 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. బీఎల్, ఆర్ఎల్, ఆర్‌సీ స్టేజీల్లో ఉన్న ఇంటి నిర్మాణాలను వచ్చే నెల 10లోపు పూర్తి చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్టీలకు రూ.1 లక్ష, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున అదనపు ఆర్థిక సాయం మంజూరు చేస్తుందన్నారు.ఈ అవకాశాన్ని గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, హౌసింగ్ ఏఈ అనిల్‌కుమార్, ఏపీఎం చంద్రకళ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా


లింగాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో శిల్పా చక్రపాణిరెడ్డి

బండి ఆత్మకూరు: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం ఆయన జీసీ పాలెం గ్రామంలో జరిగిన వెలుగోడు మండలం మాధవరం వైఎస్సార్‌సీపీ నాయకులు మిద్దె శాంతుడు కుమార్తె వివాహానికి హాజరయ్యారు. అనంతరం లింగాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపిరెడ్డి వెంకట రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో అలివికాని హామీలిచ్చి గెలిచిన తర్వాత ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సమావేశంలో ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భూమా వెంకటనాగిరెడ్డి, నాయకులు బారెడ్డి ధరణీధర్ రెడ్డి, సగిలె కృష్ణారెడ్డి, నరెద్దుల నాగిరెడ్డి, చింతకుంట్ల నరసింహారెడ్డి, ఎర్రం హరికిషన్ రెడ్డి, గొంగటి భాస్కర్ రెడ్డి గోపిరెడ్డి మధు, భూమా విజయ్‌కుమార్‌రెడ్డి, బారెడ్డి అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్... యథేచ్ఛగా ప్లాట్ల విక్రయం

- రెవెన్యూ, గ్రామపంచాయతీ అనుమతి లేకుండా లేఅవుట్
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు


తర్తూరు అంచె సమీపంలో నందికొట్కూరుకు వెళ్లే మార్గంలో కేజీ రోడ్డు పక్కన వేసిన లేఅవుట్

జూపాడుబంగ్లా: అనుమతుల్లేకుండా లేఅవుట్లు వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయిస్తున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటంతో పలు విమర్శలు వ్యక్తవుతున్నాయి. మండ్లెం గ్రామపంచాయతీ, రెవెన్యూ పరిధిలోని తర్తూరు అంచెకు సమీపంలో నందికొట్కూరుకు వెళ్లే దారిలో కేజీ రోడ్డు పక్కన సర్వేనెంబర్ 247–బీ2 లోని ఎ.1.96 సెంట్ల భూమిలో పంచాయతీరాజ్ చట్టం 1994, సెక్షన్ 82, నుంచి 84 వరకు అనుమతుల్లేకుండా లేఅవుట్ వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయిస్తున్నా పట్టించుకునేనాథుడే లేరనే విమర్శలున్నాయి. సెంటు రూ.2 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు విక్రయిస్తూ పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వాస్తవానికి గ్రామ పంచాయతీకి నిర్ణీత రుసుమును చెల్లించి అనుమతి పొందిన తర్వాత ల్యాండ్‌కన్వర్సన్ చేయించుకోవాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీ అనుమతులు తీసుకోకుండా లేఅవుట్ వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయించి సొమ్ముచేసుకుంటూ వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు.ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను వివరణ కోరగా తాను వచ్చిన తర్వాత ఎవ్వరికీ ఎలాంటి ల్యాండ్‌కన్వర్సన్ అనుమతులు ఇవ్వలేదన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డిని వివరణ కోరగా తాము ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. వెంచర్ నిర్వాహకులు తప్పనిసరిగా కూడా అనుమతి పొందాలని నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. అలాగే విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

భారతసైన్యానికి మద్దతుగా..


అంబేడ్కర్ విగ్రహం వద్ద సైన్యానికి మద్దతు తెలుపుతున్న అఖిలపక్షాలు

శ్రీశైలంప్రాజెక్ట్: భారత సైన్యం ఉగ్రవాదులపై జరుపుతున్న దాడికి మద్దతుగా శ్రీశైలం మండలంలో గురువారం అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. సున్నిపెంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ జెండాను చేతబూని మద్దతు ప్రకటించారు. ఉగ్రవాద అంతానికి చేస్తున్న సైనిక చర్యకు భారత పౌరులందరూ మద్దతుగా ఉన్నారని, అవసరమైతే ఉగ్రవాదుల అంతానికి పౌరులుగా తమవంతు దేశసేవను చేస్తామని నినదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెరటి తోటలు పెంచండి


ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న రైతులను సన్మానిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రతి పొదుపు మహిళ పెరటితోటలను పెంచుకోవటం అలవర్చుకోవాలని ఏపీఎం అంబమ్మ తెలిపారు. గురువారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై పొదుపు మహిళలు, రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏపీఎం అంబమ్మ, ప్రకృతి వ్యవసాయ నియోజకవర్గ కన్వీనర్ అయ్యస్వామి మాట్లాడుతూ రైతులు తొలకరి చినుకులకు ముందు నవధాన్యాలను సాగుచేసుకోవటం వల్ల భూసారం పెరిగి ప్రధాన పంటలకు చీడ, పీడల వ్యాప్తి తగ్గి అధికదిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం భూసారపరీక్షలు చేస్తున్నందున రైతులు తప్పనిసరిగా వాటి ఫలితాలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు వాడుకోవాలన్నారు. ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వినియోగించటం వల్ల భూసాంద్రత దెబ్బతిని పొలాలు చౌడుభూములుగా మారుతాయన్నారు. దీంతో సాగుచేసిన పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించటం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. మహిళా రైతులు గ్రూపుగా ఏర్పడితే రుణాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పోస్టర్లను విడుదల చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలు సాగుచేస్తున్న రైతులను సన్మానించారు.

గూడ్సు రైలు కింద పడి యువకుడి మృతి


మృతి చెందిన ఖలీల్

మహానంది: గూడ్సు రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం గాజులపల్లె రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. గాజులపల్లెకు చెందిన కొత్తూరు ఖలీల్ (30) ప్లంబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఖలీల్ గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద రైల్వేట్రాక్‌పై వెళ్తున్న బొసెన్ గూడ్సు రైలు కింద పడి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుసేన్ ఆలం, బేగం, సోదరుడు హుసేన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద విలపించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

20న దేశవ్యాప్త సమ్మె

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు సీపీఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్ తెలిపారు. గురువారం సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బీసన్న, నాగరాజు, రాజీవ్, శ్రీరామ్, దొరస్వామి, రూతమ్మ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీపీఐ నాయకులు